శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 27, ప్రభాతవార్త** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు లైంగిక వేదింపుల నుండి మహిళలు, పిల్లల రక్షణ- సామాజిక పాత్ర అనే అంశం మీదను, అలాగే పోలీసు ఉద్యోగులకు సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ మోసాలు అరికట్టడంలో సాంకేతిక పాత్ర అనే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీయుట, పోలీసు శాఖ పట్ల పూర్తి స్థాయిలో అవగాహన, స్ఫూర్తి కల్పించుటయే ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యాసరచనలలో వ్యక్తపరిచారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థి దశ నుంచే సమాజం, పోలీసు వ్యవస్థ, చట్టాలపై విద్యార్థులకు అవగాహన పెరుగుతుంది. తద్వారా బాధ్యతమైన పౌరులుగా ఎదిగి భవిష్యత్తులో సమసమాజాన్ని స్థాపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ(ఏఆర్), డీఎస్పీ-ఏఆర్, ఎస్‌బీ సీఐ, పీఆర్ఓ, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి మధ్యాహ్నం వరకే కొండబిట్రగుంటలో దైవ దర్శనానికి అనుమతి



**బిట్రగుంట, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి దేవస్తానంలో ఈనెల 29వ తేదీన సంభవించనున్న పాక్షిక చంద్రగ్రహణం కారణంగ ఈనెల 28వతేది శనివారం మద్యాహ్నం రెండుగంటలవరకే భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించడం జగుగుతుందని ధర్మకర్తలి మండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, కార్యనిర్వహణాదికారి అరవ రాధాకృష్ణలు తెలిపారు. కావున కొండబిట్రగుంటకు దైవదర్శనానికి విచ్చేసే సుదూరప్రాతాలనుంచి వచ్చే భక్తులు ఈసమయాన్ని దృష్టిలోపెట్టుకొని తనకు సహకరించాలని వారు విజ్ఞప్తిచేశారు.

## డ్రైడేను పటిష్టంగా నిర్వహించాలి



**కోవూరు, అక్టోబర్27 ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామీణ ప్రాంతాల్లో శుక్రవారం నాడు డ్రైడే కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి ఈ. హుసేనమ్మ అన్నారు. కోవూరు మండలం పాటూరు పంచాయతీ పరిధిలోని ప్రాంతాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతపై మరింత అవగాహన చేసుకోవాలన్నారు. తొట్టెల్లో నీరు నిల్వ ఉంచకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సీజన్‌లో దోమల వ్యాప్తి జరగకుండా ప్రజలు కూడా తమవంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి పి. నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్ ఇలియాజ్, దిలీప్, శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

## విగ్రహా ప్రతిష్టలో కోవూరు ఎమ్మెల్యే



**కోవూరు, అక్టోబర్27 ప్రభాతవార్త :** కోవూరు మండలం జమ్మిపాలెం గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. ఊరి పొలిమేర నుంచి ఆలయ మర్యాదలతో, మేళతాళాలతో ఎమ్మెల్యేను స్వాగతించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ ప్రమీలమ్మ,, ఎంపీడీవో శ్రీహరి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలతపార్టీ సీనియర్ నాయకులు మీరారెడ్డి, సుధీర్‌రెడ్డి, నందగోపాల్‌రెడ్డి, విజయకుమార్, వెంకటేశ్వర్లు, కె. ప్రసాద్, గుత్తికొండ వెంకయ్య, విజయకుమార్, వెంకటేశ్వర్లు, సుధీర్‌రెడి, వెలుగు ఏపీఎం వెంకటస్వామి, పొదుపు మహిళలు ఉన్నారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి

**ముత్తుకూరు, అక్టోబర్27, ప్రభాతవార్త** మహిళల ఆర్థిక అభివృద్ధికి ఆదాని ఫౌండేషన్ కృషి చేస్తుందని ఆదాని ఫౌండేషన్ సదరన్ రీజనల్ సీఎస్ఆర్ హెడ్ అనీల్ బాలకృష్ణన్ తెలిపారు. శుక్రవారం కృష్ణపట్నం పోర్టులో ఆదాని ఫౌండేషన్ మద్దతుతో 10మహిళా స్వయం సహాయక సంఘాల ఆదానీ కృష్ణపట్నంపోర్టులో ఒక్కరోజు ఎక్స్‌పోను నిర్వహించారు. 120మందికి పైగా మహిళలు, పురుషులు ఎక్స్‌పోలో పాల్గొన్నారు. రోజువారి వినియోగం సంబంధించిన చేతితో తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఉత్పత్తులు జనపనార సంచులు, తాటి ఆకుల బుట్టలు, దీపపు స్తంబాలు, సబ్బులు, ఊరగాయలు, ఫ్లోర్ క్లీనర్లు, ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్, ఎడిబుల్ ఆయిల్, చికీలు మొదలైన కార్పోరేట్ వ్యవహారాల హెడ్ వేణుగోపాల్ మహిళా ఉత్పత్తులను తిలకించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఉత్పత్తులను మహిళలు తయారు చేయడం హర్షనీయమన్నారు. ఆయన పలు ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ఆదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్, సర్వీస్ కంపెనీల ఉగ్యోగులు పైన పేర్కొన్న రోజువారి వినియోగ ఉత్పత్తులను కోనుగోలు చేశారు. మహిళలు తమ ఆర్థిక అభివృద్ధికి ఆదాని ఫౌండేషన్ చేయూతను అందించడంతోపాటు వారి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేష్ రంజన్, గంగా సతీష్, హెచ్ఆర్ డి.జి.యం శ్రీనివాసులు, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## రాయలకాలంనాటి పురాతన విగ్రహాలు లభ్యం



**ఉదయగిరి, అక్టోబర్27 ,ప్రభాతవార్త** మండలకేంద్రమైన ఉదయగిరిలో గల మంగళకట్ట ప్రాంతంలోని పేడదిబ్బలో శ్రీకృష్ణ దేవరాయలకాలం నాటి పురాత విగ్రహాలు లభ్యమైయ్యాయి. అక్కడ మట్టి తవ్వుతుండగా విగ్రహాలు లభ్యమైయ్యాయని ఆనాడు రాయలవారు నిర్మించిన పాతభవనంలో ఈ విగ్రహాలను ప్రతిష్టింపచేశారు. విగ్రహాలకు శుభ్రపరిచి ధూప, దీప, నైవేద్యాలతో పూజించిన అనంతరం భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ మహావిష్ణువు సతీసమేతంగా శ్రీదేవి, భూదేవి సమేతంగా ఉన్న విగ్రహాలకు తమకు లభ్యమైయ్యాయని ఈ విగ్రహాలను ఎంతో భక్తిశ్రద్ధలతో ఆలయంలో ప్రతిష్టించామని తెలిపారు. దాతలు దయతలచి ఈ విగ్రహాలకు తోడ్పాటు అందిస్తే దేవాలయం నిర్మించి భక్తుల దర్శనార్థం ఉంచుతామని తెలిపారు.

## కొలిదిబ్బలో పర్యటించిన ఫ్యామిలీ హెల్త్ సర్వే కేంద్ర బృందం

**తోటపల్లిగూడూరు, అక్టోబర్ 27, ప్రభాతవార్త** నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే కేంద్ర బృందం సభ్యులు రెండు నెలలుగా నెల్లూరు జిల్లాలో కొన్ని గ్రామాలను ఎంచుకొని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలు, లబ్ధిదారులకు అందాల్సిన ఆర్థిక అంశాలపై రాండం సర్వే నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. కొలిదిబ్బ ఎస్టీ కాలనీ నందు ఆరోగ్య సూచీలపై సమగ్రమైన గణాంకాలు నివేదికలు కొరకు క్షుణ్ణంగా సర్వే నిర్వహిస్తున్నట్లు టీమ్ లీడర్ చంద్రకళ, నోడల్ అధికారులు టి.రాజయ్య, సీహెచ్ సుధాకర్‌రావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే కేంద్ర బృందం సభ్యులు సుమలత, ప్రణీత, దీపిక, శామ్యూల్, వీరా స్వామి, పరమేష్, మమత, స్థానిక వైద్య సిబ్బంది ఎస్‌కే ఖాజాబి, అల్తాఫ్, ఆశా వాలంటీర్లు మాధవి, సుశీలమ్మ, అంగన్‌వాడీ టీచర్ మంజుల, ఈశ్వరమ్మ తదితరులు ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే 'జగనన్నకు చెబుదాం'



**కొడవలూరు అక్టోబర్ 27 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండల కేంద్రాలలో " జగనన్నకు చెబుదాం"(స్పందన) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం హరి నారాయన్ పేర్కొన్నారు. శుక్రవారం కొడవలూరు మండలంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణ నందు శుక్రవారం " జగనన్నకు చెబుదాం"(స్పందన) కార్యక్రమంను కలెక్టర్ ఎం.హరినారాయన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు నుండి గ్రామస్థాయి అదికారులు వరకు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామప్రజల నుంచి జిల్లా కలెక్టర్ అర్జీలు స్వీకరించి, తగు శాఖల అధికారులకు సమస్యలను పరిష్కరించే దిశగా సూచినలు చేశారు. అనంతరం అయన విలేకర్లతో మాట్లాడతూ ప్రజా సమస్యలను తీర్చే దిశగా ప్రభుత్వం 2019 నుంచి స్పందన కార్యక్రమాని నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. అయితే స్పందన అనే కార్యక్రమానికి పెద్దపీట వేస్తూ, గ్రామీణ ప్రజల, మారుమూల ప్రాంతాల ప్రజల సమస్యలను పర్యవేక్షించడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఈ సంవత్సరం మే నెల 9వతేదీన ముఖ్యమంత్రి కార్యలయం నుండి "జగనన్నకు చెబుదాం" అనే కార్యక్రమానికి ప్రారంభించడం" జరిగిందని అని తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశం గ్రామీణ ప్రజలు సమస్యలను పరిష్కరించే దృష్ట్యా, ప్రజలు జిల్లా కేంద్రంకు వచ్చి ఎన్నో ఇబ్బందులకు గురి అవుతున్నారు అని ఉద్దేశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి బుధవారం, శుక్రవారం ముందుగా మండల ప్రజలకు షెడ్యూలను తెలియజేస్తూ, ఈ కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జివో విడుదల చేశారు అని పేర్కొన్నారు. కావున మండలాల వారిగా "జగనన్న చెబుదాం" అనే కార్యక్రమాని ఏర్పాటు చేసుకున్నాం అన్నారు. ముఖ్యంగా రెవిన్యూ సమస్యలను పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. సచివాలయం వ్యవస్థ ఏర్పాటు చేసిన తరువాత మండలంలో చాలా వరకు సంక్షేమ పథకాల సమస్యలు తగ్గించే ప్రయత్నాలు జరుగుతుందని తెలియజేశారు. ఒకవేళ ఏమైన సమస్యలు ఉంటే, ఆ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం వేదికగా ఉంటుందని పేర్కొన్నారు. కొడవలూరు మండలంలో ప్రజా సమస్యలపై 75 అర్జీలు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే 1902కు తెలిజేస్తే వాటిని కూడా పరిష్కరించగలం అని అన్నారు. ఈ అవకాశంను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, జెడ్పీ సిఈవో బి. చిరంజీవి, ఆర్డీవో శీనానాయక్, పిడి డిఆర్‌డిఎ సాంబశివారెడ్డి, నుడా విసి బాపిరెడ్డి, డ్వామా పిడి వెంకటరావు, జిల్లా సర్వేఅధికారి హనుమాన్ ప్రసాద్, హౌసింగ్ పిడి నాగరాజు, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర రాజు, ఆర్టీసీ ఆర్ఎం శేషయ్య పరిశ్రమల శాఖ జేడీ సుధాకర్, సిపివోఎస్ రాజు, డిఇవో గంగాభవాని, డిసిహెచ్ఎస్ రమేష్‌నాథ్, ఆరోగ్యశ్రీ డాక్టర్ చంద్రశేఖర్, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, పసుసంవర్ధక శాఖ జేడీ మహేశ్వరుడు, జిల్లా హార్టీకల్చర్ అధికారి సుబ్బారెడ్డి, పిడి మైక్రో ఇరిగేషన్ శ్రీనివాసులు, ఆర్ అండ్ బి పంచాయితీరాజ్, ఎలక్ట్రికల్ ఎస్ఇలు అనేక అధికారులు పాల్గొన్నారు.

## సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యం



**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 27, ప్రభాతవార్త** జిల్లాలోని పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా భావించి పోలీసు వెల్ఫేర్ డేను జిల్లా ఎస్పీ డాక్టర్ కే.తిరుమలేశ్వర్‌రెడ్డి శుక్రవారం నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అర్జీలను స్వయంగా స్వీకరించి సమగ్రంగా విని, వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. డీపీఓ పరిపాలన విభాగ అధికారులకు ఆయా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు తగు ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న పనులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిబ్బంది గ్రేడ్ ఇంక్రిమెంట్, బదిలీలు, సస్పెన్షన్, డిజర్షన్ నుండి విధులకు తీసుకోవడం, సర్వీసు సంబంధిత సమస్యలు, డిప్యుటేషన్, భద్రత, ఆరోగ్య భద్రత, హౌసింగ్ లోను, విద్యా సంబంధిత లోన్‌లకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు సంబంధిత అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ డ్రాఫ్ట్ రోల్ 2024 జాబితా విడుదల చేసిన కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబర్27, ప్రభాతవార్త** కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని సిటీఅసెంబ్లీ నియోజకవర్గం-117, ఓటర్ మూల జాబితా రోల్-2024 లిస్టను కమిషనర్ వికాస్‌మర్మత్ శుక్రవారం విడుదల చేశారు. కార్యాలయంలో జరిగిన ఓటరు జాబితాను ప్రకటించిన అనంతరం కమిషనర్ మాట్లాడుతూ విడుదల చేసిన ఓటర్ల జాబితాను సంబంధిత అన్ని పోలింగ్ స్టేషన్లతో పాటు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రచురణకు ఉంచామని తెలిపారు. బిఎల్‌వోల నిర్వహణలో ఇంటింటి విచారణ అనంతరం అన్ని రకాల ఫారంలను క్షుణ్ణంగా పరిశీలించి జాబితాను రూపొందించామని తెలిపారు. సవరణల అనంతరం జాబితా తుది దశకు చేరిన నూతన జాబితాను ఓటర్లందరూ పరిశీలించుకుని వివరాలను సరిచూసుకోవాలని కమిషనర్ సూచించారు. 2024 జనవరి 5 నాటికి జాబితా సవరణలను పూర్తి చేసి ఫైనల్ రోల్‌ను ప్రకటిస్తామని కమిషనర్ వెల్లడించారు. ప్రస్తుత జాబితాలో చేర్పులు ఉన్నవారు సంబంధిత బిఎల్‌ఓలను సంప్రదించి సవరణలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని కమిషనర్ సూచించారు. ఓటర్ డ్రాఫ్ట్ రోల్ పబ్లిష్ చేయు నిమిత్తంగా ఏఈఆర్‌ఓలు దేవికుమారీ, ధనుంజయరెడ్డి, దశయ్య, ఎలక్షన్ డి.టి మాధవి, చక్రపాణి, టౌన్‌ప్లానింగ్, సిబ్బంది పాల్గొన్నారు.



## సచివాలయాలు తనిఖీ చేసిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబర్27, ప్రభాతవార్త** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక బాలాజీనగర్ ప్రాంతంలోని 15/1, 15/2, 15/3, 16/1 వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్‌మర్మత్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాలలోని ఇన్వెక్షన్ రిజిష్టరు, నోటీసుబోర్డు, హాజరు రిజిష్టర్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల రిజిష్టర్లు పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ అమలును అన్ని సచివాలయాల్లో ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వైద్యసదుపాయాలు అవసరమైన అందరికీ చేరువయ్యేలా సచివాలయ హెల్త్ సెక్రటరీలు కృషి చెయ్యాలి అని కమిషనర్ సూచించారు. అదేవిధంగా సచివాలయాల్లో పెండింగులో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని సచివాలయ కార్యదర్శులకు కమిషనర్ సూచించారు. ఎస్‌డిజి సర్వే, భూహక్కు సర్వే, ఏపి సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, సూచించిన యాక్షన్ ప్లాన్ అమలుచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## సోమరాజుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష



**ఇందుకూరుపేట, అక్టోబర్ 27, ప్రభాతవార్త** పేదల చెంతకే వైద్యాన్ని తీసుకొచ్చే సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే గొప్ప లక్ష్యం, తపనతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని కొవూరు శాసనసభ సభ్యులు, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సోమరాజుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును మాజీ మంత్రి పరిశీలించారు. తొలుత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్, స్పాట్ రిజిస్ట్రేషన్, కేస్ షీట్ కౌంటర్, ల్యాబ్ టెస్టింగ్ కౌంటర్, మందుల పంపిణీ కౌంటర్‌ను పరిశీలించిన మంత్రి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా అనేక వ్యాధులతో బాధపడుతూ ఆసుపత్రులకు వెళ్లకుండా నిర్లక్ష్యం వహిస్తున్న పేదలకు, వారి ఇంటి ముంగిటకే వెళ్లి వైద్య సేవలు అందించడమే జగనన్న సురక్ష ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటి వరకు 438 పైగా క్యాంపులు నిర్వహించి సుమారు 1.50 లక్షల మంది పేదలకు వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యం చేయించుకున్న రోగులకు సంబంధించి నిరంతరం వైద్యుల పర్యవేక్షణ, మందుల పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఆరోగ్య సమస్యలను గుర్తించిన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు తరలించి ఉన్నత స్థాయి వైద్యం అందేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పేదల ఆరోగ్యానికి భద్రత కల్పించాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజలకు ఆనందం అందించాలనేగొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ధనవంతులకు మాత్రమే సాధ్యమయ్యే వైద్య సేవలను పేదలకు అందిస్తున్నట్లు చెప్పారు. సుమారు మూడు వేలకు పైగా వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చి పేదవాడికి మరింత ఆరోగ్య భద్రత కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మూడో సచివాలయం పరిధిలో గడగడపకు మన ప్రభుత్వం



**వింజమూరు అక్టోబర్ 27 ప్రభాతవార్త** : వింజమూరులోని మూడో సచివాలయం పరిధిలో శుక్రవారం ఉదయగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆద్వర్యంలో గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వింజమూరులోని శ్రీచెన్నకేశవస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజగోపల్‌రెడ్డి విచ్చేసిన సందర్భంలో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలోపూజలు అనంతరం గడపగడపకు తిరిగి జగనన్న నాలున్నార సంవత్స రాలలో అమలు చేసిన అభివృద్ధి సంక్షేమపదకాలను రాజగోపాల్‌రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గడిచిన 7 నెలలో తాను నియోజవర్గ ఇన్‌చార్జిగా బాద్యతలు స్వీకరించినప్పటి నుండి నియోజవర్గంలో 30 సచివాలయాల పరిధిలో గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. ప్రతి చోట మంచి స్పందన లభిస్తుందని అన్నారు. మరో సారి వైసిపి అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఓటరు జగనన్నపై ఉన్న అభిమానంతో చూపుతున్న ఆదరణ నిదర్శమని అన్నారు. నియోజకవర్గంలోని వెనుకబాటు తనం గురించి, త్రాగు, సాగునీటి సమస్య రహదారులు, నిరుద్యోగ సమస్యలను జగనన్న దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందని అన్నారు. అడిగిన ప్రతిపనిని జగనన్న చేసేందుకు సిద్దంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షనేత స్కాంలలో కటకటాలపాలైతే ,మరో పార్టీ జనసేన నాయకుడు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రగల్బాలు పలుకుతున్నాడని అన్నారు. రాష్ట్రంలో ఎన్ని పార్టీలు ఆరోపణలు చేసినా నమ్మేస్థితిలో లేరని అన్నారు. జగనన్న చేపట్టిన సంక్షేమాబివృద్దే ఆయనకు అండగా నిలుస్తాయని అన్నారు. ఈకార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు గనం బాలకృష్ణారెడ్డి, వైసిపినాయకులు గువ్వల కృష్ణారెడ్డి, కన్వీనర్ రేవునూరి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యాక్షులు ఆణంగి రమణయ్య, సర్పంచ్ నల్లగొండ్ల సుజన, సొసైటి చైర్మన్ విజయ్‌కుమార్‌రెడ్డి, యువజన నాయకులు గణపం రమేష్‌రెడ్డి, సొసైటీ డైరక్టర్ ఆణంగి రాజేష్, జెసిఎస్ కన్వీనర్ ప్రసాద్‌రెడ్డి, విజయ్‌కృష్ణారెడ్డి, ఎం.రాయుడు, నీరం సంజీవ్‌రెడ్డి, అంకినపల్లి నరసింహారెడ్డి, మదూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, వెలుగోటి రమేష్, సర్పంచ్ దాట్ల రమణారెడ్డి, ఎంపిడిఒ రాజేష్‌బాబు, పంచాయితీ ఇఒ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తరుణవాయిలో జగనన్న ఆరోగ్య సురక్ష



**సంగం అక్టోబర్ 27 ప్రభాతవార్త** : సంగం మండలం తరుణవాయి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గోపి, డాక్టర్ ప్రతిమ, మాజీ జడ్‌పిటిసి తుంగా ఇందూదర్‌రెడ్డి, వైసిపినాయకులు బాలనాయుడు, ఇఒపిఆర్‌డి రమేష్‌బాబు, ఎంపిటిసి సభ్యురాలు పెంచలమ్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తుంగా ఇందూదర్‌రెడ్డి మాట్లాడుతు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు కార్పోరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆయన తెలిపారు. ప్రజలందరు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన పేదలకు మందులు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలింటర్లు, వైద్యసిబ్బంది, పాల్గోన్నారు.

## నరుకూరులో జగనన్న ఆరోగ్య సురక్ష




**తోటపల్లిగూడూరు, అక్టోబర్ 27, ప్రభాతవార్త** : మండలంలోని నరకూరు గ్రామ సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు శుక్రవారం నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల తహశీల్దార్ లావణ్య తన సందేశంలో మండలంలోని ఇప్పటి వరకు 14 సచివాలయాల పరిధిలో ప్రతి క్యాంపులలో సుమారు 400మందికి తగ్గకుండా ఉచితంగా వివిధ వైద్య పరీక్షలు జరుపుకొని మందులు తీసుకోవడం జరిగిందన్నారు. ఇక పేదూరు కోడూరు బీట్2 సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించాల్సి ఉందన్నారు. ఎంపీడీఓగా నూతన బాధ్యతలు చేపట్టిన ప్రత్యూష మాట్లాడుతూ ఈ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు ద్వారా బడుగు, బలహీన వర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇందుకోసం తమ వంతు సహకరిస్తున్న వివిధ విభాగాల వైద్యులు, ఆరోగ్య సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అన్నం శ్రీనివాసులు గౌడ్, వెలిచర్ల శ్రీనివాసులు గౌడ్, ఈవోపీఆర్డీ నారాయణరెడ్డి, కొణతం రఘుబాబు, స్థానిక నేతలు వేగూరు శ్రీనివాసులు, ముసలి పరందామయ్య, కోడూరు వరిగొండ పీహెచ్‌సీ వైద్యులు భానుప్రియ, నరసింహారావు, నరేష్, వైద్య ఆరోగ్య సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యులు, వైద్యశాలల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి




**కావలి, అక్టోబర్27, ప్రభాతవార్తః** వైద్యులు, వైద్యశాలల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఐ.ఎమ్.ఎ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అద్యక్షులు డాక్టర్ రవికృష్ణ తెలియజేశారు. కావలి ఐ.ఎం.ఎ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేఖర్ల సమావేశంలో డాక్టర్ రవికృష్ణ మాట్లాడారు. వైద్యశాలలపై దాడులుచేస్తే శిక్షలు మరింత కఠినంగ వుండాలని కోరారు. చిన్న వైద్యశాలైన 20పడకల వైద్యశాలలోకూడా ఆరోగ్యశ్రీ వర్తించేవిదంగ రాష్ట్ర ప్రభుత్వం చూడాలని తెలిపారు. ఆరోగ్యశ్రీని విస్తృత పరచిన రాష్ట్ర ప్రభుత్వానకి రాష్ట్రముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఐ.ఎం.ఎ ప్రపంచంలో అతిపెద్ద వృత్తి సంఘమని కొనియాడారు. వైద్య రక్షణచట్టం పటిష్టంగ చేయాలని అన్నారు. వైద్యులపై కేసుల నమోదుకు నిర్దిష్ట నియమావళి ఉండాలని పేర్కొన్నారు. ఆసుపత్రులకు ఏకగవాక్ష విధానంలో అనుమతులివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని చెప్పారు. అగ్నిమాపకశాఖ నరభ్యంతరపత్రం నిభందనలు సవరించాలని అన్నారు. వైద్యశాలల ఏర్పాటుకు రాయితీలు ప్రకటించాలని కోరారు. అర్హత, శిక్షణ లేని వైద్య చికిత్సలను నిరోదించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ వైద్యదినోత్సవం సందర్బంగ ప్రభుత్వ ప్రవేటు రంగాలలో పనిచేస్తున్న వైద్యులకు రాష్ట్ర ప్రభుత్వం పురష్కారాలు ఇవ్వాలని తెలియజేశారు. కేంద్రం అన్ని వైద్య విధానాలను మిళితంచేయడం నిలుపుదల చేయాలని అన్నారు, కేంద్రం ఇండియన్ మెడికల్ సర్వీసెస్‌ను ప్రవేశపెట్టాలని అన్నారు. ఐ.ఎం.ఎద్వార ఎన్నో సామాజిక సేవలు చేయడం జరిగిందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం వైద్యవిదానాల రూపకల్పనలో ఐ.ఎం.ఎను భాగస్వామ్యం చేయాలని అన్నారు. అనంతరం కావలి ఐ.ఎం.ఎ శాఖ ఆద్వర్యంలో డాక్టర్ రవి కృష్ణను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగ సత్కరించారు. సీనియర్ వైద్యులు మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఎన్ ప్రభాక్‌నాయుడ్ని కావలి ఏరియావైద్యశాల విశ్రాంత మెడికల్ సూపరింటెండ్ డాక్టర్ నాగమణిని దుశ్శాలువ, పూలమాలలతో సన్మానించారు. ఐ.ఎం.ఎ కావలి నూతన శాఖ ఎం.పిక...ఐ.ఎం.ఎ కావలి శాఖ నూతన అద్యక్షుడిగ డాక్టర్ కె సుబ్బారావు, కార్యదర్శిగ డాక్టర్ గోపి, కోశాదికారిగ డాక్టర్ శివప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ మనోహర్‌బాబు, డాక్టర్ సతీష్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ నళినిపద్మ, డాక్టర్ మాలినీదేవి, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ విజయ్‌భాస్కర్, మరియు ఐ.ఎం.ఎ వైద్యులు పాల్గొన్నారు.

## రెచ్చిపోతున్న ఇసుక మాఫీయా-ట్రాక్టర్ ఇసుక 3 వేలు



**సీతారామపురం అక్టోబర్ 27 ప్రభాతవార్త** : సీతారామపురం మండలంలో ఇసుకమాఫీయా ఆగడాలు రోజు రోజుకు అధికమౌ తున్నాయి. మండలంలోని పలు వాగులలో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. రోజుకు 25 నుండి 30 ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా చేస్తు అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. నాళా చట్టానికి తిలోధకాలు ఇస్తు ఇసుక మాఫీయా రెచ్చిపోతున్నా రు. ప్రతి రోజు అధికారుల కళ్ళ ముందే ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న అధికారులు చూసిచూడనట్లు వ్యవహారి స్తున్నారు. ప్రభుత్వం అధికారల నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అధికారులకు నెల మామూళ్లు చెల్లించి ఇసుకను యదచ్చేగా తవ్వుకుంటున్నారు. ఇసుక అక్రమార్కులు కేవలం ఇసుకను తరలించేందుకు జెసిబిలను సైతం కొనుగోలు చేసి ఇసుక త్రవ్వకాలు జరుపుతున్నారంటే ప్రభుత్వ ఆదాయం ఎంత మేర దోచుకుంటున్నారో అర్ధం చేసుకోవచ్చు. ఇసుక అక్రమరవాణాను అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులను నియమిస్తే వారు మామూళ్ళకు అలవాటు పడి అక్రమార్కులకు నీడలాగా వ్యవహారిస్తు సహకరిస్తున్నారని ప్రజలు బహిరంగంగా విమర్శలు చేస్తున్నా రు. మండలంలో సుమారు 9 మంది ట్రాక్టర్ యజమానులు ఇసుక అక్రమరవాణా నిర్వహిస్తున్నారనే సమాచారం ఎస్ఇబి ,రెవిన్యూ అధికారులకు ముడుపులు అందించి ఇసుక మాఫీయా రెచ్చిపోతునా న్నరని విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా ఇసుక మాఫీయా అక్రమార్కులు వాగుల నుండి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి డంపింగులుగా ఏర్పాటు చేసి ఇసుక అమ్ముకుంటున్నారు. ట్రాక్టర్ ఇసుకను సుమారు 3 వేల నుండి 3 వేల 5 వందల రూపాయాలకు అమ్ముతు అక్రమార్కులు జేబులు నింపుకుంటు ప్రభుత్వ ఆధాయానికి గండికోడుతున్నారు. అధికారుల నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తు అధిక ధరలు అమ్మడం వల్ల భవన నిర్మాణాలు చేపట్టే వారు లబోదిబో మంటున్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకొని ప్రభుత్వా నిబంధనల ప్రకారం ఇసుక రవాణా జరపాలని పలువురు కోరుతున్నారు.

## రిజిస్టార్ అఫీస్‌లలో దళారుల వ్యవస్థకు స్వస్తి




**ఉదయగిరి, అక్టోబర్27, ప్రభాతవార్త** : మండల కేంద్రమైన ఉదయగిరిలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నేటి నుండి ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 2.0 కార్యక్రమం ద్వారా ప్రజలకు రిజిస్ట్రేషన్ సదుపాయాలు కల్పించబడతాయని రిజిస్టార్ తెలిపారు. హక్కు దారులు తమకుతాముగా సొంతంగా డాక్యుమెంటేషన్ నుండి రిజిస్ట్రేషన్ వరకు పూర్తి పారదర్శకంగా తమ పనులు తామే చేసుకోవచ్చునని, మధ్యవర్తుల అవసరం లేకుండా ఈ అవకాశాన్ని కల్పించడం జరిగిందని సబ్‌రిజిస్టర్ తెలిపారు. కానీ తరతరాల నుండి స్టాంప్ వెండర్లు, స్టాంప్ అమ్మకాలద్వారా తమ జీవనాన్ని గడుపుతూ ఉండగా నేడు ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ పథకం ద్వారా తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ప్రభుత్వం మరోసారి ఆలోచించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ప్రజలకు అవగాహన కొరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ పథకం గురించి ఉదయగిరి సబ్‌రిజిస్టార్ కార్యాలయం ఎదుట పోస్టర్లను ఏర్పాటు చేశారు.

## తిరుమలాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష



**ఉదయగిరి, అక్టోబర్27, ప్రభాతవార్త** : ఉదయగిరి మండలం తిరుమలాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండల ఎంపీడీవో డి.ఈశ్వరమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తిరుమలాపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల నుండి అధికసంఖ్యలో ప్రజలుపాల్గొని తమ ఆరోగ్యాలకు సంబంధించిన సమస్యలను వైద్యుల ద్వారా పరీక్షించుకుని ఉచిత మందులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గండిపాలెం పిహెచ్‌సి డాక్టర్ శివకల్పనారెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిని సందర్శించి ఆ ఇంటిలోని కుటుంబసభ్యులకు దీర్ఘకాలిక సమస్యలు, కంటిచూపు సమస్యలు మొదలైన వాటికి నిపుణులైన వైద్యులచే సదుపాయాలు అందించడం జరిగిందన్నారు. అంతేకాకుండా వారికి అవసరమైన కళ్లద్దాలు, మందులు ఇచ్చి అవసరమైన వారికి కార్పోరేట్ ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగిందని అక్కడా వారికి ఉచిత వైద్యం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

**కావలి, అక్టోబర్27, ప్రభాతవార్త:** మున్సిపల్ కార్మికులను పరిమినెంట్ చేయాలని ఎ.పి మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఎ.ఐ.టి.యు.సి) రాష్ట్ర ప్రధానకార్యదర్శి పోరుమామిళ్ళ సుబ్బరాయుడు డిమాండ్‌చేశారు. కావలి పట్టణంలోని ఎ.ఐ.టి.యు.సి కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఎ.పి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కౌన్సిల్ సమావేశంలో సుబ్బరాయుడు మాట్లాడుతు ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోలో భాగంగ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పరిమినెంట్ చేయాలని మాటతప్పని, మడమతిప్పని ముఖ్యమంత్రిగ జగన్‌మోహన్‌రెడ్డి నిలబడాలని వారు డిమాండ్ చేశారు. ధరల నియంత్రణ లేకపోవడంతో కార్మికలు కుటుంబాలు చాలీ చాలని వేతనాలతో తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారని అన్నారు. కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని అలాగే సుప్రీమ్‌కోర్టు తీర్పు ప్రకారం మున్సిపల్ కార్మికులు డ్రైనేజి పనులలో పనిచేస్తు మరణిస్తే రాష్ట్ర ప్రభుత్వంకూడా ఆకార్మికుల కుటుంబాలకు 40లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియ చెల్లించాలని కోరారు. మున్సిపల్ రంగంలో శాస్వత పనిలో పనిచేస్తున్న డైలివేర్ కార్మికులను అప్కస్లోచేర్చి ప్రస్తుతం ఒప్పంద కార్మికులకు ఎంతవేతనం చెల్లిస్తున్నారో అంతే మొత్తం ఈకార్మికులకు కూడా ఇవ్వాలని సాంఘిక భద్రతలో భాగమైన పి.ఎఫ్, ఇ.ఎస్.ఐని వర్తింపచేయాలని తెలిపారు. జిఒ నంబర్ 25ప్రకారం విధులలో మరణించిన కార్మికుల కుటుంబాలకు స్తానిక మున్సిపాల్టీలనుంచి రెండు లక్షల రూపాయలు, ప్రమాదాల బారీనపడి మరణిస్తే 5లక్షల రూపాయలు ఆకుటుంబాలకు చెల్లించి వారి కుటుంబాల సభ్యులను తిరిగి ఆపనులలో పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు నివేశన స్తలాలు ఇచ్చి శాశ్వత గృహాలను నిర్మించాలని అన్నారు. పెండింగ్‌లోవున్న డైలీవేస్ కార్మికుల మరియు స్కూల్ స్వీపర్ల వేతనాలు సత్వరం విడుదల చేయాలని డిమాండ్‌చేశారు లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగ ఐక్యకార్యాచరణ రూపొందించి ఉద్యమిస్తామని తెలిపారు. ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి గుంజి కిషోరు, ఎ.పి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్ల గౌవరఅద్యక్షులు మల్లి అంకయ్య, నగర అద్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, పట్టణ నాయకులు ప్రభావతి, రాజేష్, తన్నీరు రమాదేవి, శుభాన్, కుంచాల వేణు. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆయనది రామరాజ్యం జగన్‌ది రావణకాష్టం

**కందుకూరు, అక్టోబర్27, ప్రభాతవార్త** ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏలుబడిలో రాష్ట్రం రావణకాష్టంలా మారిందని శాసనమండలి మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ అహ్మద్ షరీఫ్ విమర్శించారు. ప్రజలకు కులాలు, మతాలు వారీగా విభజించి కుట్ర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి ఇంటూరినాగేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఉదయం జరుగగా షరీఫ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం షరీఫ్ మాట్లాడుతూ కందుకూరులో అధికారపార్టీ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి నియంత పరిపాలన కొనసాగిస్తున్నారని షరీఫ్ విమర్శించారు. 2012 నుంచి కందుకూరు మున్సిపల్ ఎన్నికలు జరగలేదని, కోర్టులో కేసులు వేయించి ఎన్నికలు జరగకుండా ఎమ్మెల్యే అడ్డుపడుతున్నట్లు అర్థమవుతోందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ వాస్తవాలన్నీ గ్రహించి రాబోయే ఎన్నికల్లో వైసీపీని ఓడించాలని షరీఫ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు పేదప్రజలకు అండగా నిలుస్తున్నాయని షరీఫ్ పేర్కొన్నారు. ఇన్‌చార్జిగా నియమితులైన ఏడాదిన్నరలోనే ప్రజలకు ఇంత దగ్గర కావడం, సొంత నిధులు వెచ్చించి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచిత మిషన్లు అందించడం చాలా గొప్ప విషయమన్నారు. రాబోయే రోజుల్లో ఇంటూరి నాగేశ్వరరావు తన సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేసి దిశగా అడుగులు వేస్తున్నారని, నియోజకవర్గ ప్రజలు ఆయనను ఆశీర్వదించాలని షరీఫ్ కోరారు. కుట్టుశిక్షణ పొంది మిషన్లు అందుకున్న మహిళలు వాటిని సద్వినియోగం చేసుకుని మరింత కష్టపడి కుటుంబాలకు ఆసరాగా నిలబడాలని షరీఫ్ సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## యువకులకు క్రికెట్ కిట్లు బహూకరణ



**ఉదయగిరి, అక్టోబర్27, ప్రభాతవార్త** : ఉదయగిరి మండలంలోని వెంగలరావు నగర్ ,గండిపాలెం గ్రామాలకు చెందిన యువకులకు ఉదయగిరి మండల జడ్పిటిసి సభ్యులు మోడి రామాంజనేయులు క్రికెట్ కిట్లను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని యువకులు క్రీడల్లో నైపుణ్యం సాధించి తమ భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని తెలిపారు. క్రీడలు మానసిక వికాసానికి, శారీరక దృఢత్వానికి మంచి సాధనాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు క్రీడా స్ఫూర్తితో మెలుగుతూ క్రీడల గురించి అవగహన కల్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గండిపాలెం వైసీపీ నాయకులు షేక్. రియాజ్, ప్రసాద్, కిషోర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అజీజ్‌కు స్టంట్ తొలగించిన వైద్యులు

**నెల్లూరు అక్టోబర్ 26, ప్రభాతవార్త-వైద్యం** : గత కొన్నిరోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్‌కి కిడ్నీకి రెండోసారి వేసిన స్టంట్‌ను చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో శుక్రవారం శస్త్రచికిత్స చేసి తొలగించారు. గతంలో ఆయన అనారోగ్య కారణంగా చెన్నై అపోలో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందిన విషయం విధితమే. తొలిసారి కిడ్నీకి స్టంటు వేయగా, అది ఫెయిల్ అవడంతో రెండోసారి స్టంట్ వేశారు. రెండోసారి వేసిన స్టంట్‌ని శుక్రవారం తొలగించారు. ప్రస్తుతం ఆయన చెన్నై అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

## జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



**ముత్తుకూరు, అక్టోబర్27, ప్రభాతవార్త** : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేద ప్రజలకు వైద్యం అందించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును సచివాలయ పరిధిలోని ఆయా గ్రామాలలో ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని బ్రహ్మదేవం పంచాయతీలో నిర్వహించారు. ఈ క్యాంపుకు ముఖ్య అతిధులుగా ఎంపీపీ గండవరం సుగుణ, జడ్పిటిసి బందెల వెంకట సుబ్బయ్య, కోఆప్షన్ సభ్యులు జమీల్, మైనార్టీ నాయకులు అగ్ని హాజరుకావడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ గండవరం సుగుణ మాట్లాడుతూ పేదలకు ఆయా గ్రామాల్లో వైద్యం అందించడం ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం ఒక చారిత్రాత్మకనిర్మాణయమన్నారు. ఈ క్యాంపులకు ప్రజల విశేష స్పందన వస్తుందన్నారు. సచివాలయ డిడిఓ వాసుదేవరావు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి నిరంజన్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ ఎడ్యుకేషన్ అచ్చీవ్‌మెంట్ సర్వేపై సమీక్ష

**ఉదయగిరి, అక్టోబర్27, ప్రభాతవార్త** : ఉదయగిరి మండలంలోని విద్యాశాఖ కార్యాలయంలో స్టేట్ ఎడ్యుకేషనల్ అచ్చీవ్‌మెంట్ సర్వేపై సమీక్ష సమావేశం జరిగింది. ఎంపిక కాబడిన ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలలకు నవంబర్3వ తేదీ జరగబోవు స్టేష్ ఎడ్యుకేషనల్ అచ్చీవ్‌మెంట్ సర్వేపై ఎంపిక కాబడిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఫీల్డ్ ఇన్వేష్ట గేటర్లకు మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉదయగిరి మండల విద్యాశాఖాధికారి 1. షేక్. మస్తాన్‌వలీ, 2. తోట శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపిక కాబడిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 3, 6, 9తరగతులు అభ్యసించే విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులపై నవంబర్ 3న పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ పరీక్షలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను తెలియపరుచుకోవానలి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మండల పరిధిలోని స్కూల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను తిప్పికొట్టండి



**కావలి, అక్టోబర్27, ప్రభాతవార్త;** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విదానాలను తిప్పికొట్టి ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడంలో రెవల్యూషనరి సోషలిస్ట్ పార్టీ ముందుంటుందని ఆపార్టీ రాష్ట్ర కన్వీనర్ సుబ్బరాయుడు తెలిపారు. కావలి పట్టణం రైల్వేరోడ్ లోని జర్నలిస్ట్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేఖర్ల సమావేశంలో సుబ్బరాయుడు మాట్లాడారు దేశంలో బిజెపి, రాష్ట్రంలో వై.సి.పి ప్రభుత్వాలు ప్రజా సమస్యలు పరిష్కారం చేయకుండ గాలికి వదిలేశారన్నారు. ఎక్కడి సమ్యలు అక్కడ తిష్టవేసి వున్నాయని తెలిపారు. వీటిపై పోరాటాలు చేస్తున్న ప్రజాస్వామ్య వాదులపై అక్రమ కేసులు పెట్టడంతోపాటు అనేక దాడులకు వడిగడుతున్నారని మండిపడ్డారు. అలాగే దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరిగి పోతుందన్నారు. రాష్ట్రంలో ఖాళాగ వున్న 2.30లక్షల పోస్టుకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు .అదేవిదంగ పెండింగ్‌లో వున్న ప్రాజెక్టులను పూర్తిచేసి ప్రజలకుసాగు, త్రాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వుద్యోగాలు దొరకక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్ళాల్సిన దుస్తుతి నేడు రాష్ట్రంలో వుందని తెలిపారు. ప్రతి జిల్లాలో ఏదోక పరిశ్రమ ఏర్పాటుచేసి స్తానికులకు ఉపాది కల్పించాలని అన్నారు. ఆర్.ఎస్.పి నెల్లూరు జిల్లా కార్యదర్శిగ రవికాంత్‌ను ఏకగ్రీవంగ ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం రవికాంత్ మాట్లాడుతు నెల్లూరు జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేనిపోరాటం చేస్తానని తెలి పారు .జిల్లాలోని అన్ని ప్రాంతాలలో ఆర్.ఎస్.పి పార్టీతోపాటు దాని అనుబంద ప్రజా, విద్యార్ధి, యువజన సంఘాలనుబలోపేతానికి కృషిచేస్తామన్నారు. బాబురావు, సీమోను, రాజేష్, మనోజ్, కిషోర్, తరుణ్, మనిచంద్ర పాల్గొన్నారు.

## హరికృష్ణను పరామర్శించిన ఎం.ఎల్.ఎ ప్రతాప్‌కుమార్‌రెడ్డి

**కావలిరూరల్, అక్టోబర్27, ప్రభాతవార్తః** కావలి ఒకటవవార్డులోని ముద్దూరుపాడుకు చెందిన వై.సి.పి నాయకులు హరికృష్ణను ఎం.ఎల్.ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పరామర్శించాడు. హరికృష్ణ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడ్డాడు దీనిని పురష్కరించుకొని ఎం.ఎల్.ఎ మద్దూరుపాడువెళ్ళి పరామర్శించాడు. ప్రమాదానికి గల కారణాలను అడిగితెలుసుకున్నాడు. ఎం.ఎల్.ఎతోపాటు వై.సి.పినాయకులు చెన్ను ప్రసాద్‌రెడ్డి, పులి చక్రపాణి తదితరులు ఉన్నారు.

## అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**కందుకూరు, అక్టోబర్27, ప్రభాతవార్త** వైద్య రంగంలో దేశంలోనే సరికొత్త ఆధ్యాయానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. నిరుపేదల పాలిట వరంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిలుస్తోందని ఆయన అన్నారు. ఆర్థిక నిరుపే ద, మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య, ఆర్థిక అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్పెషలిస్ట్ వైద్యులతో గ్రామాల్లోనే ప్రతిష్టాత్మకంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. కందుకూరు పట్టణ ప్రాంతంలో ఒక్కటే ఏరియా ఆసుపత్రి ఉండేదని అలాంటిది ఇప్పుడు రెండు వైయస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్లు ప్రారంభించడం జరిగిందన్నారు. ఒకటి కోటారెడ్డినగర్‌లో, రెండవది జనార్ధన్ కాలనీ ప్రాంతంలో ప్రారం భించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పురపాలక సంఘ అధికారులు, డాక్టర్లు, అంగన్వాడీ టీచర్లు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**కోవూరు, అక్టోబర్27 ప్రభాతవార్త :** రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక వినూత్న పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సహకార సొసైటీలో 1-4-2022 నుంచి 30-9-2022 వరకు రబీ సీజన్‌లో ధాన్యం కొలువు కేంద్రాలకు ధాన్యం తోలిన 966 మంది రైతులకు హమాలీ చార్జీల కింద 24,64,650 రూపాయల నగదు చెక్కులను కోవూరు సహకార బ్యాంక్ మేనేజర్ సుధాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి ఆశించిన మేర చొరవ చూపిన దాఖలాలు లేవన్నారు. ఈ పాలనలో రైతుకు గిట్టుబాటు ధర అందించేలా ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. పడుగుపాడు సహకార సొసైటీ ఛైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ సొసైటీకి సంబంధించి ఇనమడుగులో ఉన్న పాత గోదాము శిధిలావస్థలో ఉందని, ఆ ప్రాంతంలో నూతనంగా పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ సొసైటీలో 11 గదులు, తలుపులు, టేకు దంతులు ఉన్నాయని, ఈ నెల 30వ తేది సోమవారం లోగా ఈ గోదాము తొలగించేందుకు టెండర్లను ఆహ్వానించడం జరుగుతుందన్నారు. వచ్చిన టెండర్లను అదేరోజు ఫైనల్ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి, మేనేజర్ ఎన్. స్వప్న, శివకుమార్‌రెడ్డి, కె. ప్రసాద్ ఉన్నారు.

# గ్రామీణ ప్రాంత ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష ఓ వరం



**కోవూరు, అక్టోబర్27 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజానీకానికి వారి ముంగిటికే వైద్యసేవలు అందించేలా ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వారికి ఎంతో ఉపయోగకరమని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరు మండలం పాటూరు పంచాయతీ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అదేవిధంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి ఆశయమన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని ప్రజలు మరలా ఆదరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అనంతరం వైఎస్సార్ కంటి వెలుగు కింద పరీక్షలు చేయించుకున్న వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీడీవో శ్రీహరి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పడుగుపాడు సొసైటీ ఛైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు విజయసేనారెడ్డి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు సుబ్బరాయుడు, వార్డు సభ్యులు ప్రసాద్, సచివాలయ కన్వీనర్ శ్రీధర్, వేమారెడ్డి శివకుమార్‌రెడ్డి, నేతలు కె. ప్రసాద్, వైద్యులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

# సీస్ పరీక్షను పటిష్టంగా నిర్వహించాలి



**కోవూరు, అక్టోబర్27 ప్రభాతవార్త :** విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు నవంబర్ 3న నిర్వహిస్తున్న స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే 2023 పరీక్షను పటిష్టంగా నిర్వహించాలని డీసీఈబీ కార్యదర్శి రామ్‌కుమార్ అన్నారు. కోవూరులోని సెయింట్ పాల్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ఈ పరీక్షకు సంబంధించి ఎంపిక చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు డిగ్రీ కళాశాల విద్యార్థులు సీఆర్‌పీలకు ప్రత్యేక శిక్షణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను మరింత మెరుగైన ఫలితాల సాధన కోసం నవంబర్ 3న ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రమే ఈ పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్షలకు డిగ్రీ కళాశాల విద్యార్థులు పర్యవేక్షణలో ఈ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్ష విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఈ పరీక్షను నిర్వహించడం జరుగుతుందన్నారు. సర్వశిక్షా అభియాన్ ఏఎంవో సుధీర్‌బాబు మాట్లాడుతూ ఈ పరీక్షను ఎటువంటి లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా నిర్వహించేలా సమిష్టి కృషి అవసరమన్నారు. ఎంఈవో రహీమ్, ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ ఉన్నారు.

# ఆర్బీకేల్లో ఈ-పంట నమోదు రైతుల జాబితా




**కోవూరు, అక్టోబర్27 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ఈ-పంట నమోదు ఖరీఫ్ 2023కి సంబంధించిన రైతుల వివరాలను ఏర్పాటు చేయడం జరిగిందని మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ఈ నెల 29వ తేది వరకు ఈ జాబితా ఉంచడం జరుగు తుందన్నారు. ఆయా ఆర్బీకేల పరిధిలోని రైతులు ఈ జాబితాలను పరిశీలించి ఏమైనా మార్పులు ఉంటే తెలియజేసి సరిచేయించుకోవాలన్నారు. అనంతరం సరిచేసిన జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే ఆర్బీకేలో ఉన్న వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ ఉపా ధ్యక్షుడు నరసింహులురెడ్డి, వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

# నేడు వాల్మీకి మహర్షి జన్మదిన వేడుకలు



**నెల్లూరు టౌన్, అక్టోబర్ 27, ప్రభాతవార్త** ఈనెల 28వ తేదీ శనివారం ఉదయం నెల్లూరు నగరంలోని కొండయ్యపాలెం గేటు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనంలో వాల్మీకి మహర్షి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి వై.వెంకటయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రమైన నెల్లూరులోని ఆయన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జన్మదిన వేడుకలను రాష్ట్ర పండుగగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా జ్యోతి ప్రజ్వలన, వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూల అలంకరణ ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం సభ జరుగుతుందని తెలిపారు. బోయ వాల్మీక కుల సంఘాల నాయకులు, సభ్యులు, వివిధ కులాలకు చెందిన నాయకులు, అనుబంధ సంస్థ నాయకులు తదితరులు పెద్దఎత్తున పాల్గొని వాల్మీకి మహర్షి జన్మదిన వేడుకలను విజయవంతం చేయాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరక్టర్ డాక్టర్ ఏ.నిర్మలాదేవి తదితర అధికారులు, స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు, శాసనమండలి ప్రభుత్వ విప్ మేరిగ మురళీధర్, తదితర ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిధులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు.

# అన్ని గోదాములు ఇస్తున్న కూలీనే ఇవ్వాలి



**కోవూరు, అక్టోబర్27 ప్రభాతవార్త :** జిల్లాలోని అన్ని ప్రైవేట్ , ప్రభుత్వ గోదాములు ఇస్తున్న కూలీనే ఇవ్వాలని యాజమాన్యం మొండి వైఖరి వీడనాడకపోతే తాము చేస్తున్న ఆందోళనను మరింత ఉధృతం చేసామని సీఐటీయూ సీనియర్ నాయకులు దయాకర్ అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు సెంటర్‌లో ఉన్న బీడబ్ల్యూసీ గోదాము ఎదుట శుక్రవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ కూలీ సక్రమంగా ఇవ్వమని అడిగితే యాజమాన్యం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం కార్మికుల శ్రమను దోచుకోకుండా అన్ని గోదాములు ఇస్తున్న కూలీనే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కె. శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు ఎస్ అంకయ్య, దామోదర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, హరి, ఆదయ్య, మధు, చింటూ , వెంకయ్య తదితరులు ఉన్నారు.

# జగనన్న ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, అక్టోబర్27 ప్రభాతవార్త :** ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మలేరియా అధికారి ఈ. హుసేనమ్మ అన్నారు. కోవూరు మండలం పాటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ ఆరోగ్య శిబిరాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిబిరంలో మంచి ప్రావీణ్యం కలిగిన స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్యసేవలను అందించడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు ఇటువంటి మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్, డాక్టర్ అనూష, డాక్టర్ చంద్రప్రియ, ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ఈనెల 30న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

**నెల్లూరు అక్టోబర్ 27, ప్రభాతవార్త-వైద్యం** గిరిజనులకు ప్రభుత్వాలు చేస్తున్న ఇండ్లకు తలుపులు, కిటికీలు, పూత పనులు చేయకుండా వదిలేసిన వాటిపై తక్షణమే విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలని ఈ నెల 30వ తారీఖున జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం నగరంలోని రామ్మూర్తినగర్‌లో ఉన్న బీజేపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో పొట్లూరి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ దర్నా గిరిజనులతో నిర్వహిస్తున్నామని, అందులో జిల్లాలో ఉన్న గిరిజనులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఇప్పటి వరకు గిరిజనుల కోసం నిర్మించిన గృహాలు మధ్యంతరంగా ఆగిపోయాయని, అయితే అందుకు సంబంధించిన కాంట్రాక్టర్లు, అధికారులు కలిసి ఆ ఇళ్ళను పూర్తి చేసినట్లు రికార్డులను చూపించి బిల్లులు తీసుకున్నారన్నారు. దీనిపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేయించాలని ఆయన కోరారు. గిరిజనులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన ఎలాంటి సంక్షేమ పథకాలు కూడా ఇప్పటి అందలేదన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఐటీడీయేకి నిధులు కేటాయించి ప్రతిపత్తి కలిగించి, గిరిజనులను అన్నివిధాలా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు చచ్చుల ప్రసాద్, కట్టా వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం అంటే అర్థం తెలియని వైసీపీ



**నెల్లూరు అక్టోబర్ 27, ప్రభాతవార్త-వైద్యం** సామాజిక న్యాయం అంటే అర్ధం తెలియని వైసీపీ ప్రభుత్వ పెద్ద లకి సామాజిక బస్సు యాత్రలు చేసే హక్కు ఎక్కడ ఉందని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంక టేశ్వర్లురెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో చేజర్ల విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటినుండి ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంబంధించిన సుమారు 120 పథకాలను రద్దు చేసి, ఆ వర్గాలపై దాడులు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. గత టీడీపీ హయాంలో ఆర్ధికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చేసింది, వారు వారి స్వంత కాళ్ళపై నిలబడేందుకు వివిధ కార్పొరేషన్‌ల ద్వారా పెద్దఎత్తున ఆర్ధిక సహాయం చేయడమే కాకుండా అనేక సంక్షేమ పథకాలను అందించిందన్నారు. జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సబ్‌ప్లాన్ నిధులను రూ.1.14లక్షల కోట్లు దారి మళ్ళించడమే కాకుండా 120 పథకాలను రద్దుచేసిన ఘనత వైసీపీదేనన్నారు. 16వేలమంది బీసీలను రాజ్యాంగ పదవులకు దూరం చేసిందని ఆయన ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాలకు టీడీపీ ఎంత ఖర్చు చేసిందో, ప్రస్తుతం వైసీపీ ఎంత ఖర్చు చేసిందో శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశాడు. సామాజిక న్యాయం, సాధికారత అనే పదాలకు కూడా అర్థం తెలియకుండా నేడు బస్సుయాత్ర ప్రారంభించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

# పోలీసుల కళ్ళు కప్పి సైదాపురం వెళ్ళిన కోటంరెడ్డి



**నెల్లూరు అక్టోబర్ 27, ప్రభాతవార్త-వైద్యం** సైదాపురం మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ వద్దకు వెళ్ళేందుకు సిద్ధమైన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి 6వ పట్టణ పోలీసుస్టేషన్ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఆయన నివాసం చుట్టూ గస్తీ కాచారు. ఇంట్లోని నుండి బయటకు వస్తున్న ఆయనని ఆయన అనుచరులని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వాళ్ళ కళ్ళు కప్పి దొడ్డిదారిన ఆయన ఆయన అనుచరులు కార్లలో సైదాపురంలో జరుగుతున్న అక్రమ మైనింగు వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ, నగర నియోజకవర్గ అధ్యక్షుడు మామిడాల మధు, కాకర్ల తిరుమలనాయుడు, ప్రశాంత్, ఆకుల హనుమంతు, మహేంద్రరెడ్డి అలియాస్ చిన్నబ్బయ్య, పెంచల చౌదరి, సుజన, నవీన్ జహీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆజాద్‌క అమృత మహోత్సవం మట్టి సేకరణ ప్రదర్శన




**మనుబోలు, అక్టోబర్27, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనుబోలులో ఆజాద్‌క అమృత మహోత్సవంలో భాగంగ సేకరించిన మట్టిని శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. స్తానిక ఎం.పి.డి.ఒ కార్యాలయంనుండి కోదండరామపురం వరకు ఎం.పి.పి గుండాల వజ్రమ్మ ఆద్వర్యంలో ఇన్‌చార్జ్ ఎం.పి.డి.ఒ ప్రసాద్ సమక్షంలో సేకరించిన మట్టిని సాంప్రదాయబద్దంగ ఊరేగించారు. ఈసందర్బంగ ఇన్‌చార్జ్ ఎం.పి.డి.ఒ ప్రసాద్ మాట్లాడుతు ఈమట్టిని ప్రధానమంత్రి నరేంద్రమోది పిలుపుమేరకు ఈనెల 29వతేది ఇన్‌చార్జ్ ఇ.ఒ.పి.ఆర్.డి కె.విరమణయ్య డిల్లీకి తీసుకు పోతారని చెప్పారు. జిల్లాలో, మండలంలో, గ్రామాలలో సేకరించిన మట్టిని డిల్లీలోని జాతీయ స్మారకవీరుల స్తూపానికి ఉపయోగిస్తారని తెలిపారు. మనుబోలు పం చాయతీ కార్యదర్శి ఆత్మకూరు వెంకటరమణయ్య, పంచాయతీ కార్యదర్శులు సోని, కృష్ణవేణి, సుదర్శన్, మంజుల, పాల్గొన్నారు.

# పొదుపు గ్రూపు సభ్యుల్లో అక్షరాస్యతా శాతాన్ని పెంచాలి

**కోవూరు, అక్టోబర్27 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని పొదుపు గ్రూపుల్లో ఉన్న సభ్యులు పూ ర్తిగా అక్షరాస్యత ఉండేలా గ్రూపు అధ్యక్షులు, వీవోఏలు ప్రత్యేక దృష్టి పెట్టిలని వెలుగు ఏపీఎం వెంకట స్వామి అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో శుక్ర వారం ఈసీ సమావే శాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ద్వారా వచ్చిన రుణాలను పూర్తి స్థాయిలో సద్వి నియోగం చేసు కోవడమే కాకుండా క్రమం తప్పకుండా తిరిగి బ్యాంకుకు చెల్లించాలన్నారు. అదేవిధంగా రికార్డు, రిజిస్టర్ల నిర్వహణ పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసు కోవాలన్నారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను జీవ నోపాధులను మరింత పెంపుదల చేసేలా దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. సంఘ మిత్ర అధ్యక్షురాలు సుగుణమ్మ, కార్యదర్శి ధనమ్మ, తది తరులు ఉన్నారు.

**పత్రికా ప్రకటన**

15-10-2016 తేది కావలి టౌన్, జనతాపేట డోర్ నెం.10-30-6ఎఫ్/1 నుండి ఇల్లు మారుతుండగా కావలి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 20.06.1962 తేదిన దాక్యుమెంటు నెం.1202/1962 గా రిజిస్టరు కాబడిన విక్రయ పత్రము పోయినది. దొరికినవారు తెలియజేయగలరు.

ఇట్లు..
షకీల్ అఫాన్, సెల్: 87122 26998

**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, డి.నెం.54-20-1బి/3ఎఫ్/యు6, 3వ అంతస్తు, కెఫ్‌సి మేడమీద, గురునానక్ నగర్ రోడ్డు, విజయవాడ-520008. ఎన్.టి.ఆర్.జిల్లా,

**సంక్షిప్త డిమాండ్ నోటీసు** (స్థిరాస్తుల కొరకు)

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు)

**ఋణగ్రహీతల పేర్లు మరియు చిరునామా: శ్రీ శేషం నిరంజన్,** తండ్రి: లేటు వెంకట కృష్ణయ్య, నివాసం: డి.నెం.15/308, వలయనందపురం, తూర్పు గూడూరు, గూడూరు, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. **శ్రీమతి శేషం అశ్విని,** భర్త: సేషం నిరంజన్, నివాసం: డి.నెం.15/308, వలయనందపురం, తూర్పు గూడూరు, గూడూరు, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. (ఇప్పటి నుండి ఋణగ్రహీతగా పరిగణించబడును) మీరు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మైపాడు బ్రాంచ్ (03921), మైపాడు** వారి వద్ద నుండి ఆస్తుల తనఖా ద్వారా ఋణ సౌకర్యము హెచ్‌ఎల్ అకౌంట్ నెం.36963679228 ద్వారా రూ.46,60,000/- ఇంటరేలియా ప్రకారం వడ్డీ చెల్లించు నిబంధనల ప్రకారం ఋణము పొందినారు.

సదరు ఖాతా ప్రకారం ఋణ పరిమితికి చెందిన బకాయిలు ఋణగ్రహీత చెల్లించక విఫలమైనారు. **తేదీ: 17-08-2023**న సదరు ఖాతా ఆర్.బి.ఐ నిబంధనల ప్రకారం నిరర్థక ఆస్తిగా అయినది. సదరు కారణంగా **తేదీ.30-09-2023** నాటికి **రూ.48,46,016.41 పై.** (అక్షరాల నలభై ఎనిమిది లక్షల నలభై ఆరు వేల పదహారు రూపాయల నలభై ఒక పైసలు మాత్రమే) + **తేదీ:01-10-2023 నుండి** కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం భవిష్య వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు, ఇతర ఖర్చులు చెల్లించవలసి యున్నది. సదరు ఋణపరిమితి గురించి **ఋణగ్రహీతలు: శ్రీ శేషం నిరంజన్ & శ్రీమతి శేషం అశ్విని.** ఆస్తి టైటిల్ డీడ్, తనఖా ఉంచినారు. ఋణగ్రహీతలు/హామీదారులు మరియు పార్టనర్స్ వివిధ సమయాలలో ఋణము తీసుకొనునట్లు అంగీకరిస్తూ తెలిపి ఉన్నారు. కానీ బకాయి సొమ్ములు చెల్లించలేదు. **తేది: 04-10-2023** నాటికి మీకు జారీ చేసిన సెక్షన్ 13(2) నోటీసు ప్రకారం బకాయిలు చెల్లించవలెనని కోరినారు. కాని అది మీకు అందలేదు లేదా అందినట్లు మీరు తెలుపలేదు. మీరు ఇంకా బ్యాంకు వారికి సదరు బకాయిలు చెల్లించలేదు. అందుచే ఈ నోటీసు ద్వారా సెక్షన్ 13(2) ప్రకారం మిమ్ముల్ని ఇందుమూలముగా కోరునది ఏమనగా ఈ నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా పై బకాయిలు చెల్లించవలెను. విఫలమైనచో బ్యాంకు వారు సదరు యాక్టులో 13(4) ప్రకారం ఏదైనా లేదా అన్ని హక్కులు ఉపయోగించి చర్యలు తీసుకొందురు. మీరు సెక్షన్ 13(13) ప్రకారం కూడా సదరు సెక్యూర్డ్ ఆస్తులను లీజు అమ్మకం లేదా ఇతర విధములుగా బ్యాంకు వారి అనుమతి లేనిదే బదిలీ చేయరాదు.

చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీతలు/హామీదారులు/లీగల్ వారసులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

షెడ్యూల్-సి: షెడ్యూల్ ఆస్తి వివరములు
బ్యాంకు తనఖా స్థిరాస్తి వివరములు

**శేషం నిరంజన్, తండ్రి: వెంకట కృష్ణయ్య మరియు శేషం అశ్విని, భర్త: శేషం నిరంజన్ గార్లకు చెందిన స్థిరాస్తి: రిజిస్టర్డ్ సేల్ డీడ్ దాక్యుమెంట్ నెం.2025/2017, తేది:22-06-2017 ప్రకారం:** నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, ఎస్‌హెచ్ పేట సబ్ రిజిస్ట్రేషన్, నెల్లూరు రూరల్ మండలం, ప్రస్తుతం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి (ఆంధ్రప్రదేశ్ చట్ట నెం.1994 యొక్క 25), వావిలేటిపాడు గ్రామ పంచాయితీ ఏరియా, వావిలేటిపాడు గ్రామం, సర్వే నెం.20లోని ఎ.4.88 సెంట్లు, సర్వే నెం.19/4లోని ఎ.1.09 సెంట్లు మొత్తం ఎ.5.97 సెంట్లు భూమిలో ఇంటి ప్లాట్లుగా మార్చబడిన ప్లాటు నెం.12లో 25 అంకణములు లేదా 200 చ॥గు॥లలో "3ఎం-హేమ్‌లెట్" "క్లాసిక్-1-హోమ్స్", విల్లా నెం.12 పేరున గల స్థలం అందు 1800 చ॥అ॥ల ఆర్‌సిసి రూఫ్ డీలక్స్ ఇల్లు. **హద్దులు: తూర్పు:** ప్లాటు నెం.13, **దక్షిణం:** ప్లాటు నెం.11, **పడమర:** 33 అ॥ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** రిజర్వ్‌డ్ ఓపెన్ స్పేస్. ఈ హద్దులలో ప్లాటు నెం.12లో 25 అంకణములు లేదా 200 చ॥గు॥లలో "3ఎం-హేమ్‌లెట్" "క్లాసిక్-1-హోమ్స్", విల్లా నెం.12 పేరున గల స్థలం అందు 1800 చ॥అ॥ల ఆర్‌సిసి రూఫ్ డీలక్స్ ఇల్లు అన్ని ఈజిమెంట్రీ హక్కులతో కలదు.

తేది : 27-10-2023
ప్రదేశం : విజయవాడ

అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

# వైసీపీది బుజ్జగింపు యాత్ర



**నెల్లూరు అక్టోబర్ 27, ప్రభాతవార్త-వైద్యం** వైసీపీ నేతలు చేపట్టింది సామాజిక బస్సుయాత్ర కాదని, అది బుజ్జగింపు యాత్రని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని రామ్మూర్తినగర్‌లో ఉన్న బీజేపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో బైరి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంటూ తాను ఆ వర్గాల వారికోసమే పుట్టానని జగన్ నమ్మబలికి అధికారంలోకి వచ్చాడని ఆరోపించాడు. వారికి మేలు చేయకపోగా అనేక సంక్షేమ పథ కాలను రద్దు చేయడమే కాకుండా నేడు సామాజిక బస్సుయాత్ర ఎందుకు చేస్తున్నట్లో అర్ధం కావడంలే ద న్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులను నవరత్నాలకు మళ్ళించి దారుణంగా మోసం చేశాడన్నారు. జగన్ అధికార దురహంకారానికి బలైపోయిన దళితులు డాక్టర్ సుధాకర్, అచ్చెన్న, దుగ్గిరాల కరుణాకర్‌లను గుర్తు చేశాడు. దళితులను వంచించిన మీరు ఈనాడు ఏ మొహం పెట్టుకుని బస్సు యాత్ర చేస్తారని మండిపడ్డారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ళలో దళితులకు ఏమి చేసిందో ఈ ప్రభుత్వం లెక్కలతో సహా బహిరంగంగా తెలియచేయాలన్నారు. లేనిపక్షంలో బస్సుయాత్రను బీజేపీ ఎస్సీ మోర్చా ప్రజాస్వామ్య పద్ధతిలో అడ్డుకుంటుందని బైరి హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుసు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు వడియార సురేశ్, బీజేపీ జిల్లా కార్యదర్శి దువ్వూరు పరుశురాం, గురవయ్య, రమణమూర్తి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకుంటాం




**చేజర్ల అక్టోబర్ 27 ప్రభాతవార్త** చేజర్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశానికి ఎలాంటి అనుమతులు లేకుండా గైరు హాజరైన అధికారులపై చర్యలు తీసుకుం టామని ఇన్‌చార్జి ఎంపిడిఒ విజయలలితా పేర్కున్నారు. ఈ సందర్భంగా ఎంపిపి తూమాటి విజయబా స్కర్‌రెడ్డి అధ్యక్షతన సాధర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతు సాధారణ సర్వసభ్యసమావేశానికి అధికారులందరు తప్పకుండా హాజరు కావాలన్నారు. సమావేశానికి హాజరుకాని అదికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు నివేదిక పంపుతామని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమపథకాలను ప్రజాప్రతినిదులు అధికారులు ప్రజలకు అందే విధంగా చూడాలన్నారు. సమావేశంలో ఉంచిన అజెండా అంశాలపై చర్చించారు. ఈకార్యక్రమంలో తహ సిల్దారు పి కృష్ణా, జడ్పిటిసి సభ్యులు పీర్ల పార్థసారధి, వైస్ ఎంపిపి వేలూరు తిరుపతినాయు డు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ



**జలదంకి, అక్టోబర్27 , ప్రభాతవార్త,** రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేకదృష్టిపెట్టి వైద్యసేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మండల వై.సి.పి కన్వీనర్ పాలవల్లి మాలకొం డారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జమ్మల పాళెంలో ఆరోగ్య సురక్ష క్యాంపు చేపట్టా రు. ఈ శిభిరానికి పాలవల్లి హాజరయ్యారై ఓపిని పరిశీలించా రు. డాక్టర్లతో మాట్లాడారు. వైద్యసేవలగూర్చి ఆరా తీశారు. రోగులతో కాసేపు మాట్లాడి ఆరోగ్యంకై తీసుకోవలసిన జాగ్రత్త గూర్చి తెలియజేశాడు. అనంతరం ఆయన మాట్లాడుతు పేదప్రజల ఆరోగ్యమే లక్ష్యంగ జగనన్న పాలన సాగుతుందని అన్నారు. గ్రామాలలో జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన కనిపిస్తుందని తెలి పారు. ఈకార్యక్రమంలో జలదంకి సొసైటి చైర్మన్ రవిరెడ్డి, వై.సి.పి జిల్లా ప్రధానకార్యదర్శి ఇస్కా మద న్‌మోహన్‌రెడ్డి, ఎం.పి.డి.ఒ శ్రీధర్‌బాబు, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు ప్రారంభం

### చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ



**బుచ్చి అక్టోబర్ 27 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో త్వరలో బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు ప్రారంభించనున్నట్లు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తెలిపారు. శుక్రవారం ఆమె పార్కుపనులను కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లతో కలిసి ఆమె పరిశీలించారు. పార్కులో ఏర్పాటు చేసివున్న పలువ్యాయామ పరికరాలు ఆమె పరిశీలించారు. పార్కు ప్రారంభిస్తే వృద్దులకు, పిల్లలకు, నిత్యం ఉదయం యోగాసనాలు, వ్యాయామం చేసుకునే వారికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నుడానిధులు కోటి రూపాయాలు వెచ్చించి పార్కు అభివృద్ధికి శ్రీకారం చుట్టారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి ఆమె ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న పార్కు పనులు వేగవంతంగా చేస్తుండడం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ చిరమణ సురేష్‌ను పనుల విషయమై తెలుసుకున్నారు. కౌన్సిలర్లు మోర్ల జయంతి, షేక్ .షకిలాబేగం, కంఠా అనంతమ్మ, బిట్రగుంట ప్రమీలమ్మ, రాచూరు సత్యనారాయణ, బిట్రగుంట సురేష్, మైనార్టీనాయకులు డాక్టర్ అల్లాబక్షు, ఏ.ఇ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

## చేపలగుంటలపై మత్యశాఖ దాడులు

### చేపలగుంటలలో చికెన్ వ్యర్థాలు పరిశీలించిన అధికారులు





**సంగం అక్టోబర్ 27 ప్రభాతవార్త** సంగం మండలంలోని వంగల్లు, పడమటిపాళెం, ఎస్‌విఆర్‌పురం గ్రామాలలో పెద్దఎత్తున చేపలగుంటలలో చికెన్ వ్యర్థాలు వేస్తున్నారని వాటి దుర్గంధం భరించలేక పో తున్నామని స్థానికులు మత్యశాఖ అధికారులతో ఫిర్యాదు చేయగా ఆశాఖకు సంబంధించిన అధికారులు గుంటలు పరిశీలించారు. గుంటలు పరిశీలించిన అధికారులు అందులో చికెన్ వ్యర్థాలు విపరీతంగా ఉం డడాన్ని గుర్తించారు. చేపల గుంటలలో చికెన్ వ్యర్థాలను వేస్తే రైతుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. **సదరన్‌చానల్ పక్కన వున్న గుంటల పరిస్థితి ఏమిటి** కనిగిరి రిజర్వాయర్ నుండి వెళ్లే సదరన్ ఛానల్ వెంట అన్నారెడ్డిపాళెం, మినగల్లు గ్రామాల సమీపంలో పెద్దఎత్తున గుంటలు వేసి అందులో చేపలకు చికెన్ వ్యర్థాలు వేస్తున్నారు. ఆనీటిని సదరన్ ఛానల్‌లోకి విడుదల చేస్తున్నారు. ఆనీళ్ళు త్రాగిన మూగ జీవాలు అనారోగ్యాలపాలౌతున్నాయి. సదరన్ ఛానల్ వెంట గట్టుపక్కనే వున్న గుంటలు కూడా పరిశీలించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు శ్రీరామరక్ష



**బిట్రగుంట, అక్టోబర్27, ప్రభాతవార్త**:రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకోసం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్యసురక్ష ప్రజలకు శ్రీరామరక్షలాంటిదని కావలి ఎం.ఎల్.ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బోగోలు మండలం పాతబిట్రగుంట వంటేరు చినబాబుల్‌రెడ్డి మెమోరియల్ జిల్లాపరిషత్ ఉన్నత పాంశాలలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భం మాట్లాడుతు ప్రజలందరికి సంపూర్ణ ఆరోగ్యం కలగాలని అందుకోసం ప్రజల ముంగిటకే వైద్యసేవలు తీసుకువచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. అందరికి ఆరోగ్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మెరుగైన వైద్యంకోసం ఆరోగ్యశ్రీద్వారశస్త్ర చికిత్సలు వంటివి చేపడుతున్నట్లు తెలిపారు. అంతకుముందు ఆయన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంబించి శిబిరంలో ఐ.సి.డి.ఎస్‌స్టాల్స్‌ను పరిశీలించడంతోపాటు శిబిరానికి విచ్చేసిన ప్రజల ఆరోగ్య స్తితిగతులను గూర్చి అడిగితెలుసుకున్నాడు అనంతరం బాలింత స్త్రీలకు పోషకాహార కిట్లను పంపిణీచేశారు. ఎం.పి.డి.ఒ అమ్మిశెట్టి వెంకటసుబ్బారావు పర్యావేక్షణలో జరిగిన ఈకార్యక్రమంలో మండల వై.సి.పి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, జట్.పి.టి.సి మద్దిబోయిన కీర్తన, నాగులవరం సొసైటి అద్యక్షుడు సుంకే మాల్లాద్రినాయుడు, గ్రామ సర్పంచ్ శ్రీరామ్‌గోపాల్, ఎం.పి.టి.సి కొర్సిపాటి మాధవ, నియోజకవర్గ వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఉప్పాల మాచర్ల, పార్టీ నేతలు మేకల శ్రీనివాసులు, కర్తం సురేందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రూ 1.20కోట్లతో ఉన్నతపాఠశాల భవనాలకు శంకుస్తాపన



**బిట్రగుంట, అక్టోబర్27, ప్రభాతవార్త**:బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామంలో కోటి ఇరవైలక్షల రూపాయలతో నిర్మించే జిల్లాపరిషత్‌ఉన్నతపాఠశాల భవనాలకు శుక్రవారం కావలి ఎం.ఎల్.ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈసందర్బంగ ఆయన మాట్లాడుతు జువ్వలదిన్నె గ్రామంలో ఉన్నత పాఠశాల మంజూరైనప్పటికి ఇప్పటివరకు విద్యార్థులకు సరిపడ గదులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఈవిషయాన్ని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఆనం అనుణమ్మ దృష్టికితీసుకుపోగ రెవెన్యూ అధికారులు స్తల సేకరణ చేపట్టడంతో నాడునేడు పదకంకింద పాఠశాల భవనాన్ని నిర్మించబోతున్నట్లు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరానికి ఈనూతన భవనాలు అందుబాటులోకి రాబోతున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు నాడునేడు పేరుతో కోట్లాది రూపాయలు వెచ్చించి వాటి రూపురేఖలు మార్చి కోర్పోరేట్‌స్తాయి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో మండల వై.సి.పి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘుతోపాటు జట్.పి.టి.సి మద్దిబోయిన కీర్తన పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వైఆర్‌జీ కేర్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌ని ప్రారంభించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

**నెల్లూరు అక్టోబర్ 27, ప్రభాతవార్త-వైద్యం** మద్రాసు బస్టాండు సమీపంలో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లాశాఖలో వైఆర్‌జీ కేర్ దయాగ్నస్టిక్స్ సెంటర్‌ని శాసనమండలి సభ్యుడు, ఐఆర్‌సిఎస్ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి ఈ సెంటర్లో అత్యాధునికమైన ల్యాబ్ పరికరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ అన్నిరకాల రక్తపరీక్షలను అతి తక్కువ ధరలతో మెరుగైన ఫలితాలను అందించే విధంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. గతంలో నెల్లూరు రెడ్‌క్రాస్ ప్రజలకు అంబులెన్స్ సేవలను అతి తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తీసుకురావడం, బాధితులను అత్యావసరమైన వైద్యం కొరకు చెన్నై, వేలూరు, తిరుపతి, హైదరాబాదు లాంటి నగరాలకు తరలిస్తూ ఎంతోమంది ప్రాణాలను కాపాడడంలో దిగ్విజయంగా ముందుకు సాగిందన్నారు. అదేవిధంగా రెడ్‌క్రాస్ సొసైటీ జనరిక్ మెడికల్ షాప్‌ని ప్రారంభించి తక్కువ ధరలకే మందులను అందిస్తున్నామని తెలిపారు. ఈ ల్యాబ్‌ను అతి తక్కువ ఖర్చులతో అందరకి ఉపయోగపడేలా ఉంటుందని వెలడించారు. రాబోయే కాలంలో డాక్టర్ల వసతిని కూడా ఏర్పాటుచేసి వైద్యసేవలను ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, కోశాధికారి పి సురేష్‌కుమార్‌జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్, కలికి శ్రీహరిరెడ్డి, కన్వీనర్లు పి లోకేష్, యు మురళీకృష్ణ, ఎ సాయిరాం, కో కన్వీనర్ ఎన్ రవీంద్రరెడ్డి రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన కుటుంబానికి ఆర్థికసాయం



**జలదంకి, అక్టోబర్27, ప్రభాతవార్త**:జలదంకి మండలం తిమ్మసముద్రం గ్రామ గిరిజన కుటుంబానికి భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర ఉపాద్యక్షుడు వద్దే శ్రీనాద్‌రెడ్డి 5వేల రూపాయల ఆర్థికసాయం చేశారు. గత నాలుగురోజులక్రితం గ్రామ అంబేత్కర్ గిరిజన కాలనీకిచెందిన దుర్గాప్రసాద్ పూరిగుడిసె ప్రమాదవశాత్తు కాలిపోయింది. దీంతో పాపం ఆపేదకుటుంబం కట్టుబట్టలతో వీధినపడింది. మూడులక్షలవరకు నష్టపోయి దీన స్తితిలోవున్న ఉదంతాన్ని గూర్చి తెలుసుకున్న శ్రీనాద్‌రెడ్డి శుక్రవారం కాలనీకి వెళ్ళి పరామర్శించాడు. ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నాడు. చలించిన ఆయన తక్షణ అవసరాలనిమిత్తం ఆమొత్తాన్ని అందజేశాడు. కష్టకాలంలో ధైర్యంగవుండాలనిభుజంతట్టారు. ఈ సందర్బంగ వద్దే మాట్లాడుతు ప్రభుత్వం వెంటనే దుర్గాప్రసాద్ కుటుంబానికి పక్కాయిల్లు కట్టించే విదంగ అదికారులు చర్యలు తీసుకోవాలని కోరా రు. ఈకార్యక్రమంలో మండల బిజెపి కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు ముడి కిషోర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, యువమోర్చా ఉపాధ్యక్షుడు కమతం బాలకోటయ్యయాదవ్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో లక్ష్మణ్‌కుమార్‌ను అభినందించిన పంచాయతీ

### డిపిఓ వాసుదేవరావు



**ముత్తుకూరు, అక్టోబర్27, ప్రభాతవార్త** నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మణ్‌కుమార్‌ను బ్రహ్మదేవం సచివాలయ డిపిఓ వాసుదేవరావు, కార్మదర్శి నిరంజన్‌తో పాటు సచివాలయ సిబ్బంది డి.మురళి, మహిళా పోలీసులు, వాలంటీర్లు, సర్పంచ్‌తోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో ప్రత్యూష బదిలీపై తోటపల్లి గూడూరు మండలం వెళ్లడం జరిగిందన్నారు. మండలంలో ఏవోగా పనిచేస్తున్న లక్ష్మణ్‌కుమార్ నూతనంగా ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగస్తులు ఒకేచోట ఎక్కువ రోజులు పనిచేయలేరని, బదిలీలు వచ్చినప్పుడు తప్పకుండా వేరొకచోటుకి వెళ్లి తమ విధులు నిర్వహిస్తారని ఆయన అన్నారు. ఎంపీడీవో ప్రత్యూష మండలంలో మంచి గుర్తింపు పొందారు.

## తడి,పొడి చెత్తను విడిగా సేకరించండి



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబర్27, ప్రభాతవార్త** నగరవ్యాప్తంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛ నెల్లూరు సాకారానికి కృషి చేయాలని అధికారులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బందిని నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు .పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక ఎస్పీ బంగ్లా, పొదలకూరు రోడ్డు, పద్మావతి సెంటర్, నిప్పో హౌసింగ్ కాలనీ, డైకాస్ రోడ్డు, వేదాయపాలెం ,అయ్యప్ప గుడి తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి కమిషనర్ శుక్రవారం పరిశీలిం చారు. స్థానికంగా ఉన్న వివిధ వీధుల్లో డ్రైను కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని, దోమల నిర్మూలనకు మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ అందజేసిన చెత్త బుట్టలలో తడి,పొడి చెత్తను విడిగా తీసి ఉంచాలని, రీసైక్లింగ్ విధానానికి ప్రజలంతా బాధ్యతగా సహకరించాలని కమిషనర్ కోరారు. సచివాలయ పరిధిలో ఆస్తి పన్నులతోపాటు యూజర్ చార్జీల వసూళ్లను బకాయిలు లేకుండా వసూలు చేయాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## డిగ్రీ ఫలితాల్లో రావూస్ విద్యార్థుల విజయం



నెల్లూరు, అక్టోబరు27 ప్రభాతవార్త-విద్య విక్రమసింహపురి యూనివర్శిటీ విడుదల చేసిన డిగ్రీ ద్వితీయ, నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో నగరంలోని స్థానిక రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరిచి సత్తా చాటారు. నాల్గవ సెమిస్టర్ డిఎస్సీ ఎమ్మెసీఎస్‌లో ఎండి జాకీరా 99శాతం, ఎస్‌కె షాకీరా 99 శాతం, ద్వితీయ సెమిస్టర్‌లో బిఎస్సీ ఎమ్మెస్సీ ఎస్‌లో పి.అమృతస్థాయి 99శాతం సాధించి సత్తా చాటారు. బిసిఏ నాల్గవ సెమిస్టర్‌లో ఎస్‌కె.ముసా క్రన్, ఏ.రోలీకుమారిలు 95.2శాతం, రెండవ సెమిస్టర్‌లో జే.వైష్ణవిరెడ్డి 96శాతం, బికాం కంప్యూటర్స్ నాల్గవ సెమిస్టర్‌లో జి.రేవతి 96శాతం, రెండవ సెమిస్టర్‌లో వి.దీప్తి 92శాతం సాధించారు. బిఎస్సీ ఎల్ఎస్ నాల్గవ సెమిస్టర్‌లో ఏ.జివితారెడ్డి 94శాతం, రెండవ సెమిస్టర్‌లో కె.శ్రీవల్లి 95శాతం సాధించారు. బిబిఏ నాల్గవ సెమిస్టర్‌లో ఎన్.నరసింహ 92శాతం, ద్వితీయసెమిస్టర్‌లో పి.హస్న 91శాతం సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. రావూస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వై.కోటేశ్వరరావు ఈ సందర్భంగా మాట్లాడుతు విద్య అందరికి అందుబాటులో ఉండాలని అత్యల్ప ఫీజులతో అత్యుత్తమ అధ్యాపకులచే తమ విద్యార్థులకు శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. అత్యాధునిక సాంకేతికతను వినియోగించి సరళతరంగా విద్యార్థులకు విద్యాబోధన చేయటం ద్వారా వారికి సబ్జెక్టుపై పట్టువచ్చేలా చేయగలుగుతున్నామని తెలిపారు. తమ విద్యార్థులకు విద్యతోపాటూ ఉపాధి అవకాశాలు కూడా కల్పించేందుకు అవసరమైన అన్నీ చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి విద్యార్థి ఉద్యోగిగా ఎదగాలన్నదే తమ ఆశయమన్నారు. అనంతరం విద్యాసంస్థల డైరెక్టర్ శివసంకేత్ మాట్లాడుతు ఇప్పటికే అనేక ప్రాంగణ ఎంపికలను నిర్వహించటం ద్వారా వందలమంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించామని, రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషిచేస్తున్నామన్నారు. తమ విద్యార్థులు యూనివర్శిటీ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించటం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ర్యాంకర్లకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఈఓ శివారెడ్డి, డీన్.పి.సుందర్, ప్రిన్సిపాల్ షరీఫ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు కార్పోరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ



**బుచ్చి అక్టోబర్ 27 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో 19,20 వవార్డులలోని వవ్వేరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మాట్లాడుతు కార్పోరేట్ వైద్యం ప్రజలకు ఇంటి వద్దనే అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వాలింటర్లు సర్వే నిర్వహించారు.
**పౌష్టికాహార ఎట్జిబిషన్ పరిశీలించిన చైర్‌పర్సన్** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సూపర్వైజర్ శకుంతల నేతృత్వంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి.సలోమి, బి రాజేశ్వరీ, సిహెచ్ స్వర్ణలత, టి.పద్మావతి ఏర్పాటు చేసిన పౌష్టికాహార ఎగ్జిబిషన్‌ను వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో ఆహారం రుచి చూసి చాలా బాగున్నాయని వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి, 20 వవార్డు కౌన్సిలర్ కత్తి శ్రీదేవి, కౌన్సిలర్లు రహమత్‌భాషా, షేక్ షకిలాబేగం, పటాన్ నస్రీన్, బెల్లం మల్లారెడ్డి, చీరల ప్రసాద్‌యాదవ్, కంటా అనంతరమ్మ, బిట్రగుంట ప్రమీలమ్మ, మోర్లజయంతి, వైఎస్‌ఆర్‌సిపి నాయకులు డాక్టర్ అల్లాబక్షు, ఎంఎస్‌కె ఆమని, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలింటర్లు పాల్గొన్నారు.

## అభివృద్ధి గురించి ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషనలు తగదు

### -అరోపణలు రుజువుచేస్తే రాజకీయాలనుండి తప్పుకుంటాం




**నెల్లూరు, అక్టోబరు27 ప్రభాతవార్త-విద్య** నెల్లూరు రూరల్‌లో విలీనగ్రామాల్లో మౌలిక వసతులు, రోడ్లు, డ్రైన్స్ తదితర అభివృద్ధిపై ప్రశ్నించినందుకు తమ నాయకుడు గునుకుల కిషోర్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తూ దూషించటం సరైన పద్ధతి కాదని జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని స్థానిక సుబేదారుపేటలోని ఆపార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జిల్లాలో అక్రమ ఇసుక రవాణా, మైనింగ్ మాఫియా, తెల్లరాయి త్రవ్వకాలు, ప్రజా సమస్యలు వంటి వాటిపై అలుపెరుగని పోరాటాలు చేసి నిత్యం ప్రజల్లో ఉంటే తమ నేతపై రోజుకో పార్టీ మారే జివి ప్రసాద్ నోరు పారేసుకోవటం సిగ్గు చేటన్నారు. నెల్లూరు రూరల్‌లో అభివృద్ధిపై ఎంపీ ఆదాలను ప్రశ్నించినంత మాత్రాన తమను కించపరుస్తూ వాఖ్యలు చేయటం, వ్యక్తిగత అంశాలను ప్రస్తావించటం మంచి పద్దతి కాదని హితవు పలికారు. గతంలో కార్పోరేషన్ ఎన్నికలు నిర్వహించిన సమయంలో 12వ డివిజన్‌లో తమ జనసేన పార్టీ అభ్యర్థిని బెదిరించి విత్‌డ్రా చేసుకునేలా చేసిన ప్రసాద్ తమపై ఆరోపణలు చేయటం నీతి మాలిన రాజకీయాలకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. పచ్చకామెర్లు వచ్చిన వారికి ఊరు మొత్తం అలాగే కనపడుతుందని, ప్యాకేజీలు తీసుకుని ఇతరుల కోసం పనిచేసే ప్రసాద్‌కు ప్రజల కోసం నిస్వార్ధంగా సేవచేస్తున్న తమ నాయకుడు గునుకులను చూసినా కూడా అలాగే కనిపిస్తుందన్నారు. నెల్లూరు రూర్‌లో ఇప్పటికీ కనీసం రోడ్లు, మంచినీరు, డ్రైన్స్ , కనీస వసతులు లేని ప్రాంతాలు అనేకం ఉన్నాయని, కార్పోరేషన్‌లో విలీనం అయిన పొట్టేపాలెం, అల్లీపురం, శ్రామిక్ నగర్, వైఎస్ఆర్ నగర్, మౌళిక వసతులు కరువైయ్యాయన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడితే దానికి సమాధానం చెప్పలేక డైవర్షన్ పాలిటిక్స్ చేయటం వైకాపా నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూరల్ ఇంచార్జ్ మాత్రమే కాదని, ఎంపీ కూడా అని గుర్తుచేశారు. అలాగేవందల కోట్ల రూపాయాల అభివృద్ధి కేవలం రూరల్‌లో మాత్రమే చేశారని బాకాలు ఊదుకుంటున్నారని, మిగిలిన ప్రాంత అభివృద్ధి ఎంపీ ఆదాలకు అవసరం లేదా అని ప్రశ్నించారు. ఎంపీ గురించి మాట్లాడే వ్యక్తి కనీసం వైకాపా జిల్లా కార్యాలయంలో గానీ లేదా ఎంపీ కార్యాలయంలో గానీ సమావేశం పెట్టలేక ఎక్కడో బయట పెట్టుకునే స్థాయి నీదని గుర్తుచేశారు. తమపై చేసిన ఆరోపణలను రుజువు చేస్తే రాజకీయాలనుండి తప్పుకునేందుకు సిద్ధంగా ఉన్నామని, అయితే నిరూపించలేని పక్షంలో చర్యలు పేమిలే వైకాపా నాయకులే తెలపాలన్నారు. నిస్వార్ధంగా ప్రజలకు సేవ చేసేందుకురాజకీయాల్లోకి వచ్చిన తమ అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో తమ నేత గునుకుల కూడా రాజకీయాల్లోకి వచ్చారని, అప్పటి నుండి అనేక సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి వాటిని పరిష్కరించిన ఘనత తమదన్నారు. అలాగే అనేక సమస్యలపై అలుపెరుగని పోరాటాలు సాగించామని గుర్తుచేశారు. అటువంటి తమ నేతపై అవాక్కులు చెవాక్కులు మాట్లాడితే చూస్తూ ఊరుకోబమని, ఇకపైనా రూరల్ లో వేసిన శిలా ఫలకాలకు సార్ధకత కలిగేలా పనులు ప్రారంబించాలని కోరారు. కెఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు సుధామాధవ్, వీర మహిళారేణుకా, నాయకులు సోయంబేటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి టిటిడి చొరవ

### నియోజకవర్గంలో 3.80 కోట్లు మంజూరు



**కోవూరు, అక్టోబర్27 ప్రభాతవార్త** : కోవూరు నియోజకవర్గంలోని 30 దేవాలయాలకు తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా 3.80 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని ఇందుకు చైర్మన్ కరుణాకర్‌రెడ్డి ,ఆలయ ఇఒ ధర్మారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు మండలం జమ్మిపాలెం గ్రామంలోని దళితవాడలో టిటిడి నిధులతో నేర్మించిన దేవాలయ విగ్రహ ప్రతిష్టా కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రస్తుతం టిటిడి ఎస్‌సి, ఎస్‌టి కాలనీలలో మాత్రమే దేవాలయాభివృద్ధికి నిధులు మంజూరు చేస్తుందని బిసి కాలనీలో కూడా దేవాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని చైర్మన్ దృష్టికి తీసుకొని వెళతామని అన్నారు. అదే విధంగా ప్రస్తుతం ఒక్కొక్క దేవాలయం నిర్మాణానికి టిటిడి ఇస్తున్న పదిలక్షల నిధులు చాలవని ఆమొత్తాని 20 లక్షలకు పెంచేలా చైర్మన్ దృష్టికి తీసుకొని వెళతామని అన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన టిటిడి పాలక వర్గానికి ప్రత్యేక దన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ సందర్బంగా గ్రామంలోని 5 పొదుపు గ్రూప్‌లకు ఆసరా ద్వారా మంజూరు అయిన 5.38 లక్షలు నిధులను వారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ ప్రమీలమ్మ, ఎంపీడీవో శ్రీహరి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలతపార్టీ సీనియర్ నాయకులు మీరారెడ్డి, సుధీర్‌రెడ్డి, నందగోపాల్‌రెడ్డి, విజయకుమార్, వెంకటేశ్వర్లు, కె. ప్రసాద్, గుత్తికొండ వెంకయ్య, విజయకుమార్, వెంకటేశ్వర్లు, సుధీర్‌రెడి, సిసిఎస్ క్యాటిరింగ్ అధినేత చంద్రశేఖర్ వెలుగు ఏపీఎం వెంకటస్వామి, పొదుపు మహిళలు ఉన్నారు. పెద్దసంఖ్యలో నేతలు, కార్యకర్తలు ఉన్నారు. పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## హారన్ మోగించాడని ఆర్.టి.సి డ్రైవర్‌పై దాడి

**కావలిరూరల్, అక్టోబర్27, ప్రభాతవార్త**:హారన్ మ్రోగించాడని విజయవాడ ఆటోనగర్ ఆర్.టి.సి డిపో డ్రైవర్ బొందిలి రామ్‌సింగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి గాయపరచారు. కావలిరూరల్ పోలీసుల సమాచారం ప్రకారం రామ్‌సింగ్, మరోడ్రైవర్ పి శ్రీనివాసరావులుబెంగుళూరునుంచి విజయవాడకు వెళ్ళే క్రమంలో మార్గమద్యంలో కావలి ట్రంక్‌రోడ్‌లోని చేపల మార్కెట్ వద్దకు బస్ చేరుకుంది. ముందుకారు వున్నందున హారన్ మ్రోగించాడు. దీంతో కారు ప్రక్కకు వెళ్ళింది బస్సు కావలి ఎ.ఎం.సి మార్కెట్ యార్డ్ సమీపంలోకి వెళ్ళిందిఅదే సమయంలో కారులో వున్న వారు బస్‌ను వెంబడించి మరికొంతమంది సహాయంతో ఆర్.టి.సి బస్‌ను ఆపి డ్రైవర్‌తో గొడవపడి రామ్‌సింగ్ చితకబాదారు డ్రైవర్ ఫిర్యాదుతో కావలి రూరల్ ఎస్.ఐ సుమన్ కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు. కాగా ఈదాడి దృష్యాన్ని కొందరు వీడియోలో చిత్రీకరిస్తున్న వారిపైకూడా గుర్తుతెలియని వ్యక్తులు దాడికి దిగడం గమనార్హం ఈసంఘటన పట్టణంలో తీవ్రచర్చనియాంశమైంది.